సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 29 । ఆగస్టు । 2025



వయోజనులకూ ఓనమాలు..

జిల్లాలో వంద శాతం అక్షరాస్యత నమోదయ్యేలా నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పించేందుకు సిద్ధమవుతున్నారు. 8లో



నిమజ్జనానికి ఏర్పాట్లు

భద్రాచలంలోని గోదావరిలో నిమజ్జనానికి వినాయక విగ్రహాలను తీసుకురానుండగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
31° / 23°

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి. సాయంత్రం తర్వాత వాతావరణం చల్లబడే అవకాశముంది.

న్యూస్‌రీల్

సుమనోహరం.. రామయ్య కల్యాణం



కల్యాణక్రతువు నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం సుమనోహరంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించిన అర్చకులు నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

స్వామి వారి పూజలకు విరాళం

శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో వివిధ పూజల నిమిత్తం హైదరాబాద్ కూకట్‌పల్లిలోని వివేకానంద నగర్‌కు చెందిన నాయినేని కృష్ణారావు – కౌసల్య దంపతులు గురువారం రూ.3.52లక్షలు అందజేశారు. అనంతరం దాతలు స్వామిని దర్శించుకోగా, వారికి ఈఓ రమాదేవి రశీదు అందజేశారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం మధ్య కొలువైన శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో గురువారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి 108 సువర్ణ పుష్పాలతో అర్చన, హారతి, మంత్రపుష్పం, నివేదన పూజలు జరిపారు. ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, అర్చకులు, వేదపండితులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు

సింగరేణిలో 18 మంది వైద్యుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా పలువురు వైద్యులను బదిలీ చేస్తూ కార్పొరేట్ ఈఈ సెల్ హెచ్ఓడీ ఏ.జే.మురళీధర్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఆరుగురు డీవైసీఎంఓలు, ఏడుగురు మెడికల్ సూపరింటెండెంట్లు, ముగ్గురు డిప్యూటీలు, ఇద్దరు సీనియర్ మెడికల్ సూపరింటెండెంట్లు ఉన్నారు. వీరంతా నూతన స్థానాల్లో వెంటనే రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాజేందర్

కొత్తగూడెంటౌన్: వచ్చేనెల 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.రాజేందర్ సూచించారు. కొత్తగూడెం జిల్లా కోర్టు హాల్‌లో గురువారం కోర్టు కానిస్టేబుళ్లతో సమావేశమైన ఆయన మాట్లాడారు. రాజీ పడదగిన పెండింగ్ కేసులు అత్యధికంగా పరిష్కారమయ్యేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అందరూ సమన్వయంతో పనిచేస్తే కేసులు ఎక్కువగా పరిష్కారమవుతాయని వెల్లడించారు. ఈ సమావేశంలో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ మెండు రాజమల్లు, లైజన్ ఆఫీసర్ ఘని, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

22 నుంచి డీఈఐఈడీ పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: వచ్చే నెల 22 నుంచి డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ ద్వితీయ సంవత్సరం థియరీ పరీక్షలు జరగనున్నాయని డీఈఓ నాగలక్ష్మి తెలిపారు. పరీక్షలు నిర్ణీత తేదీల్లో ఉదయం 9నుంచి 12 గంటల వరకు జరుగుతాయని వెల్లడించారు. అలాగే, తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ కూడా విడుదలైందని తెలిపారు. పూర్తి వివరాల కోసం పరీక్షల సహాయక కమిషనర్ ఎస్.మాధవరావు(89192 79238)ను సంప్రదించాలని డీఈఓ సూచించారు.

■ తాలిపేరు కళకళ



మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఛత్తీస్‌గఢ్‌తో పాటు రాష్ట్రంలోనూ భారీ వర్షాలతో వరద చేరుతుండగా 24 గేట్లు ఎత్తి 64,003 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 74మీటర్లు కాగా, 71.12 మీటర్లుగా క్రమబద్ధీకరిస్తున్నారు. – చర్ల

■ సింగభూపాలెం భళా



మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని సింగభూపాలెం చెరువులోకి భారీగా వరద చేరడంతో నిండుకుండలా మారింది. చెరువు సామర్థ్యం 21 అడుగులు దాటడంతో ప్రస్తుతం చెరువు అలుగు పారుతోంది. ఈమేరకు 500 క్యూసెక్కుల నీరు వస్తుండగా అంతేస్థాయిలో వరద అలుగు ద్వారా దిగువకు వెళ్తోంది. – సుజాతనగర్

■ కిన్నెరసాని పరవళ్లు



ఎగువన వర్షాలతో పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయానికి వరద పెరిగింది. 407అడుగుల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 5వేల క్యూసెక్కుల వరద రావడంతో గురువారం 404.50 అడుగులకు చేరింది. దీంతో ఒక గేటు ద్వారా 5వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. – పాల్వంచరూరల్

మనం భద్రమేనా?!



2024 ఆగస్టులో భారీ వర్షంతో మునిగిన మణుగూరు

జిల్లావాసులను వెంటాడుతున్న వరద భయం

- 'క్లౌడ్ బరస్ట్' అయితే జిల్లా అల్లకల్లోలమే
- చిన్నపాటి వానకే వణికిపోతున్న పట్టణాలు
- వరద నిర్వహణకు కొత్త మాడ్యూల్ తప్పనిసరి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వానాకాలంలో వర్షాలు, వరదల తీరుతెన్నుల్లో కొన్నేళ్లుగా తేడాలు కనిపిస్తున్నాయి. తుపాన్ ప్రభావంతో మబ్బులు ముసురుకుని గంటల తరబడి కురిసే వర్షాలకు బదులు ఆకాశం బద్దలైనట్టు కుండపోత వాన కురవడం ఎక్కువైంది. 30 చదరపు కి.మీ. ప్రదేశంలో 24 గంటల వ్యవధిలో 10 సెం.మీ. కంటే ఎక్కువ వర్షం కురిస్తే దాన్ని క్లౌడ్‌బరస్ట్‌గా పేర్కొంటారు. ఈ తరహా పరిస్థితి తలెత్తితే ఒక్కసారిగా వరద ఊరూవాడ, పొలం చెలక తేడా లేకుండా అంతా కమ్మేస్తుంది. కేవలం పది సెం.మీ. మీటర్ల వర్షానికే పరిస్థితులు ఇంత భయానకంగా మారతాయనుకుంటే.. గడిచిన నాలుగైదేళ్లుగా క్లౌడ్ బరస్ట్ కారణంగా 30 సెం.మీ.కు తక్కువ కాకుండా వర్షం కురుస్తోంది. ఏటా ఒక జిల్లా క్లౌడ్ బరస్ట్ కారణంగా చిగురుటాకులా వణికిపోతున్న నేపథ్యాన జిల్లాలో ఈ పరిస్థితితో తట్టుకోవడం సాధ్యమేనా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

మనకు మరింతగా

రాష్ట్రంలోనే అత్యధిక అడవులు ఉన్న జిల్లాగా భద్రాద్రి కొత్తగూడెంకు గుర్తింపు ఉంది. జిల్లాలో ఎక్కువ ప్రాంతం కొండలు, గుట్టలతో నిండి ఉంటుంది. సముద్ర మట్టానికి తక్కువ ఎత్తులో ఉంది. దీంతో ఇక్కడ క్లౌడ్ బరస్ట్ తరహా వర్షాలు వస్తే పరిస్థితి క్షణాల్లోనే బీతావహంగా మారే ప్రమాదముంది. గతంలో 2005లో దమ్మపేట మండలంలో 40 సెం.మీ. వర్షపాతం నమోదవగా 2013లో వాజేడు మండలంలో 53 సెం.మీ. వర్షపాతం నమోదైంది. నిన్నామొన్నటి వరకు తెలంగాణలో ఇదే అత్యధిక వర్షపాతంగా రికార్డు ఉండేది. అయితే 2023లో ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో 64 సె.మీ. వర్షపాతం కురవగా కొత్త రికార్డు నమోదైంది. గత క్లౌడ్‌బరస్ట్ బాధిత జాబితాలో మణుగూరు, అశ్వారావుపేట మండలాలు చేరాయి.

మోగిన ప్రమాద ఘంటికలు

గతేడాది ఆగస్టు 31 రాత్రి మణుగూరులో 31 సెం.మీ. వర్షం కురవడంతో కట్టవాగు ఉప్పొంగింది. గంటల వ్యవధిలో పట్టణంలో సగం మేర ముంపునకు గురైంది. ఈ వరద తీవ్రత నుంచి తప్పించుకోలేక ఒక దివ్యాంగుడు ప్రాణాలు కోల్పోయాడు. అంతకు ముందు జూలై 18న జిల్లా సరిహద్దు ఏపీలోని గుబ్బల మంగమ్మ గుట్టల మీద 27 సెం.మీ. భారీ వర్షపాతం నమోదైంది. దీంతో దిగువన అశ్వారావుపేట మండలంలో పెద్దవాగుకు వరద పోటెత్తింది. చూస్తుండగానే పరీవాహక ప్రాంతాలను ముంచెత్తగా పొలాల్లోని రైతులు, వివిధ పనులపై బయటకు వచ్చిన వారు వరదలో చిక్కుకుపోయారు. అదృష్టవశాత్తు చీకటి పడే సమయానికి హెలీకాప్టర్లతో రెస్క్యూ ఆపరేషన్ మొదలవడంతో వారంతా ప్రాణాలతో బయటపడ్డారు. ప్రాణనష్టం తప్పినా వరద తీవ్రతకు పెద్ద వాగు ప్రాజెక్టు కొట్టుకుపోయింది. ఫలితంగా ప్రాజెక్టు దిగువన ఏపీలో ఉన్న వేలేరుపాడు మండలం అతలాకుతలమైంది.



అశ్వారావుపేట సమీపాన వరదలో చిక్కుకున్న వ్యక్తిని రక్షిస్తున్న రెస్క్యూ బృందం (ఫైల్)

జాగ్రత్త పడాల్సిందే

జిల్లా కేంద్రమైన కొత్తగూడెం మీదుగా ముర్రేడు, గోధుమ వాగు వెళ్తున్నాయి. ఈ వాగు ఉధృతికి ఏటా గట్టుపై ఉన్న ఇళ్లు కూలిపోతున్నాయి. వాగుకు రక్షణగా గేబియన్ వాల్ నిర్మించాలని రెండేళ్లుగా చేస్తున్న ప్రయత్నాలు ముందుకు సాగడం లేదు. గోధుమవాగు కారణంగా విద్యానగర్, బైపాస్ రోడ్డు ప్రాంతాలకు ముంపు పొంచి ఉంది. ఈ వాగు అంచు వెంట పెరిగిన చెట్లు, ముళ్ల కంపలు భారీ ప్రవాహానికి అడ్డుగా మారే అవకాశం ఉంది. వాగు వెంట జంగిల్ క్లియరెన్స్ చేపట్టాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. పాల్వంచలోని దమ్మపేట రోడ్డులో లోతట్టు ప్రాంతాల్లో డ్రెయినేజీలు మెరుగుపర్చాలి. అలాగే, వచ్చే సీజన్ నాటికైనా బుగ్గవాగుకు రక్షణ గోడ నిర్మిస్తే ఇల్లెందుకు వరద ముప్పు తప్పుతుంది. గతేడాది వరదల దృష్ట్యా మణుగూరులో కట్టవాగుకు పూడికతీత పనులు చేసినా ఆశించిన స్థాయిలో ఫలితం స్థానికులు చెబుతున్నారు. క్లౌడ్‌బరస్ట్ తరహా పరిస్థితులు ఎదురైనా వరద సాఫీగా సాగేలా పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఇవికాక పల్లెలు, పట్టణాల్లో వరద నీటి నిర్వహణ పద్ధతులకు మెరుగుపెట్టకపోతే జనం ఆందోళనగా గడపాల్సిన పరిస్థితులు ఎదురవుతాయి.

పెరిగి.. తగ్గిన గోదావరి





భద్రాచలంలో గోదావరి ప్రవాహం (ఇన్‌సెట్) నీట మునిగిన పర్ణశాల నారచీరల ప్రాంతం

ఎగువన వర్షాలతో భారీ వరద

భద్రాచలం: భద్రాచలం వద్ద గోదావరి మళ్లీ క్రమంగా పెరిగినట్లే పెరిగి రాత్రికి తగ్గుముఖం పట్టింది. నాలుగు రోజుల క్రితం మూడో ప్రమాద హెచ్చరిక సమీపానికి వచ్చిన వరద ఆ వెంటనే తగ్గిపోయింది. దీంతో ఏజెన్సీ వాసులు ఊపిరి పీల్చుకోగా ఇప్పుడు మళ్లీ ఆందోళనకు గురవుతున్నారు. భద్రాచలానికి ఎగువ ప్రాంతాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గోదావరికి భారీ వరద చేరుకుంది. అంతేకాక తాలిపేరు ప్రాజెక్టు గేట్లన్నీ తెరిచారు. ఛత్తీస్‌గఢ్‌లో వర్షాలతో దిగువన శబరికి నీరు చేరగా వరద పోటెత్తింది. దీంతో గోదావరి మరింత పెరుగుతుందనే అంచనాతో అధికారులు పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు ఫోన్ చేయాలని ఎస్పీ రోహిత్‌రాజ్ సూచించారు. తప్పనిసరైతే తప్ప ఎవరూ బయటకు రావొద్దని, గోదావరితో పాటు ఇతర జలవనరుల వద్ద వీడియోలు, సెల్ఫీల కోసం వెళ్లి ప్రమాదాల బారిన పడొద్దని తెలిపారు.

పెరిగి.. మళ్లీ తగ్గి

గురువారం తెల్లవారుజామున 4గంటలకు 29 అడుగులు ఉన్న గోదావరి అనంతరం వేగంగా పెరిగింది. ఉదయం 9గంటలకు 35.80అడుగులకు చేరగా 11గంటలకు 36.90 అడుగులుగా నమోదైంది. ఆతర్వాత నెమ్మదిగా పెరిగిన గోదావరి సాయంత్రం 5గంటలకు 38.60 చేరి, 6గంటలకు కూడా అదేస్థాయిలో ఉండగా.. రాత్రి 10 గంటలకు 37.50అడుగులకు పడిపోయింది. ఉదయమే స్నానఘాట్లు నీటమునగగా గజ ఈతగాళ్లు, లాంచీలను సిద్ధం చేశారు.

- దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలంలో గోదావరి పరవళ్లతో పర్ణశాల వద్ద నారచీరల ప్రాంతం నీట మునిగింది. గుబ్బలమంగి వాగు ప్రాజెక్టు, తులసమ్మ, గంగోలు చెరువులు నిండుగా ప్రవహిస్తున్నాయి. సున్నంబట్టి–బైరాగులపాడు మధ్య రహదారిపైకి వరద చేరింది.

సీఎం పర్యటన మళ్లీ వాయిదా

మరోవైపు చివరి దశకు చేరిన ఏర్పాట్లు

చంద్రుగొండ: సీఎం రేవంత్‌రెడ్డి చంద్రుగొండ మండల పర్యటన మళ్లీ వాయిదా పడింది. తుపాను ప్రభావానికి తోడు ఈనెల 30నుంచి అసెంబ్లీ సమావేశాలు ఉండడంతో సీఎం పర్యటన వాయిదా పడినట్లు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గురువారం వెల్లడించారు. ఈనెల 21న చంద్రుగొండ మండలం బెండాలపాడులో సీఎం ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభిస్తారని మొదట ప్రకటించారు. ఈ పర్యటన వాయిదా పడగానే సీఎం 30న దామరచర్లలో పర్యటిస్తారని తెలిపారు. హెలీప్యాడ్, సభాస్థలి పనులు జరుగుతుండగానే పర్యటన వాయిదా పడినట్లు వెల్లడించారు. అయితే, సెప్టెంబర్‌లో సీఎం పర్యటన ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు.



దామరచర్లలో సభ నిర్వహణకు సిద్ధమైన వేదిక

'స్థానిక' ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం



మాట్లాడుతున్న ఎంపీ రవిచంద్ర, పక్కన ఎమ్మెల్సీ మధు, కాంతారావు, వనమా తదితరులు

- వచ్చే నెల 10, 11వ తేదీల్లో కేటీఆర్ పర్యటన
- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో తీసుకెళ్లేలా బీఆర్‌ఎస్ శ్రేణులు కృషి చేయాలని, తద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో సులువుగా విజయం సాధించొచ్చని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. కాగా, వచ్చే నెల 10, 11వ తేదీల్లో బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కొత్తగూడెంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అధ్యక్షతన గురువారం జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీకి ఎనిమిది మంది చొప్పున ఎంపీలు ఉన్నా యూరియా కొరతను తీర్చలేకపోతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం తిరోగమన దిశలో పయనిస్తోందని దుయ్యబట్టారు. భద్రాచలం నుంచి బీఆర్‌ఎస్ తరఫున గెలిచిన తెల్లం వెంకట్రావు ఆతర్వాత కాంగ్రెస్‌లో చేరగా, స్పీకర్ నోటీసులు ఇవ్వగానే పార్టీ మారలేదని చెప్పడం గర్హనీయమని తెలిపారు. బీసీలను రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ మోసం చేసే ప్రయత్నాలు మొదలుపెట్టిందని చెప్పారు. కాగా, కేటీఆర్ జిల్లా పర్యటన పార్టీ శ్రేణులకు రీచార్జ్‌లా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడగా, జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ పార్టీ సంస్థాగత ఎన్నికలను త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. కేటీఆర్ జిల్లా పర్యటనలో భాగంగా కొత్తగూడెం, పినపాక, భద్రాచలం నియోజకవర్గాల్లో పర్యటిస్తారని వివరించారు. మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు బానోత్ హరిప్రియ, మెచ్చా నాగేశ్వరరావు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, నాయకులు రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్, కాపు సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కాగా, కొత్తగూడెం బాబుక్యాంపు వద్ద ప్రతిష్ఠించిన గణనాథుడిని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర దర్శించుకుని పూజలు చేశారు. ఎమ్మెల్సీ తాతా మధుతో పాటు దిండిగాల రాజేందర్, కాపు సీతాలక్ష్మి, బాదావత్ శాంతి, అనుదీప్, నవతన్, శ్రీకాంత్, కన్నీ, రమాకాంత్ పాల్గొన్నారు. అలాగే, కొత్తగూడెంలో సమావేశం ముగించుకుని ఖమ్మం వెళ్లే క్రమాన మార్గమధ్యలో రహదారిపై పెద్దసంఖ్యలో కోతులు కనిపించడంతో ఎంపీ రవిచంద్ర తదితరులు అరటి పండ్లు వేసి వాటి ఆకలి తీర్చారు.

అవగాహన కోసం 'డెమో ఫామ్'

- మోరంపల్లి బంజరలో ఏర్పాటుకు సన్నాహాలు
- పరిశీలించిన కలెక్టర్ జితేష్ వి.పాటిల్

బూర్గంపాడు: జిల్లా ప్రజల ఆదాయం పెంచడం, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా అవగాహన కల్పించేందుకు మోడల్ డెమో ఫామ్ ఏర్పాటుచేయనున్నట్లు కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. మండలంలోని మోరంపల్లిబంజర సమీపాన సీతారామ కెనాల్ పక్కన ఇరిగేషన్‌శాఖ భూమిలో మోడల్ డెమో ఫామ్ నిర్మాణానికి గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ స్థలంలో కూరగాయల సాగు, మట్టి ఇటుకల తయారీ యూనిట్, వెదురు, వాక్కాయ కంచె ఏర్పాటుచేయడంతో పాటు మునగసాగు చేపట్టాలని సూచించారు. తద్వారా రైతులు, మహిళలకు నూతన వ్యవసాయ సాగు విధానాలపై అవగాహన కల్పించొచ్చని తెలిపారు. తహసీల్దార్ కేఆర్‌కేవీ.ప్రసాద్, ఎంపీఓ బాలయ్య, ఆర్‌ఐ నర్సింహారావు, ఏఈ సందీప్, ఏపీఓ విజయలక్ష్మి, ఏపీఎం నందిని, పంచాయతీ కార్యదర్శి భవాని, ఏఓ నాగార్జున పాల్గొన్నారు.

నాణ్యమైన ఇటుకల తయారీ

మణుగూరు రూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఉపాధి హామీ పథకం పనులను నాణ్యమైన ఇటుకలు అందించేలా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ పాటిల్ తెలిపారు. మణుగూరు మండలం చిక్కుడుగుంట ప్రాంతంలోని బీటీపీఎస్ సమీపాన ఫ్లైయాష్‌తో ఇటుకల తయారీని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 30న నాణ్యమైన ఇటుకల తయారీపై శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. బీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్న, తహసీల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, ఎంపీఓపి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దివ్యాంగుల నిర్ధారణ క్యాంపులు

కొత్తగూడెంఅర్బన్: దివ్యాంగుల నిర్ధారణకు నిర్వహించే క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. దివ్యాంగుల వైకల్య శాతాన్ని నిర్ధారించి ఉపకరణాలు అందించేందుకు ఏర్పాటుచేసే శిబిరం బ్రోచర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పాత కొత్తగూడెంలోని జెడ్పీహెచ్‌ఎస్(ఆనందఖని పాఠశాల)లో ఈనెల 30, సెప్టెంబర్ 1, 2వ తేదీల్లో జరిగే శిబిరాలకు దివ్యాంగ బాలలు, తల్లిదండ్రులు హాజరుకావాలని తెలిపారు. ఈ విషయమై ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తూ, వివరాలకు జిల్లా సమ్మిళిత విద్యా కోఆర్డినేటర్ ఎస్.కే.సైదులు(98487 86166)ను సంప్రదించేలా వివరించాలన్నారు. డీఈఓ బి.నాగలక్ష్మి, అధికారులు సైదులు, నాగరాజశేఖర్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.



డెమో ఫామ్ ఏర్పాటుపై సూచనలు చేస్తున్న కలెక్టర్ పాటిల్

యూరియా కోసం రైతుల ఆక్రందన

- రహదారిపై బైఠాయించిన అన్నదాతలు
- చర్చించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: యూరియా కోసం రైతుల కష్టాలు తీరడం లేదు. ఇల్లెందు మార్కెట్‌కు గురువారం ఉదయమే పెద్దసంఖ్యలో రైతులు చేరుకోగా, యూరియా లేదని సమాచారం ఇచ్చారు. దీంతో ఆగ్రహించిన వారు ఆస్పత్రి ప్రధాన రహదారి వరకు ర్యాలీగా వెళ్లి ఆందోళనకు చేపట్టారు. సమాచారం అందుకున్న సీఐ సురేష్ చేరుకుని సర్దిచెప్పినా ఆందోళన విరమించకపోవడంతో ఎమ్మెల్యే కోరం కనకయ్య చేరుకుని మాట్లాడారు. అయినా రైతులు ససేమిరా అనటంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈక్రమాన మార్కెట్‌కు వెళ్లిన ఎమ్మెల్యే అక్కడ అధికారులతో చర్చించి బఫర్ స్టాక్‌గా ఉన్న 20 టన్నుల ఎరువును ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేయించడంతో వివాదం సద్దుమణిగింది. కాగా, రైతులతో సమన్వయం చేయలేకపోయిన సొసైటీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడీఏ లాల్‌చంద్, ఏఓ సతీష్, సీఈఓ హీరాలాల్, రాజు, మార్కెట్, సొసైటీల చైర్మన్లు బానోతు రాంబాబు, మెట్టల కృష్ణ, నాయకులు నబీ, కిరణ్, కృష్ణ, మోహన్‌రావు, రాజు, యాకుబ్‌షావలీ, బుర్ర వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సర్దిచెబుతున్న ఎమ్మెల్యే కనకయ్య

క్లుప్తంగా

మూడో అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్‌గా 'వనం'


వనం వినయ్‌కుమార్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం జిల్లా కోర్టులో మూడో అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌గా వనం వినయ్‌కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు హైకోర్టు నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. దీంతో గురువారం ఆయన కొత్తగూడెం రెండో అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బి.రవికుమార్ నుంచి బాధ్యతలు స్వీకరించారు.

భద్రాచలం అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌గా దుర్గాభవాని


దుర్గాభవానితో న్యాయవాదులు, సిబ్బంది

భద్రాచలంఅర్బన్: భద్రాచలం అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌గా దుర్గాభవాని గురువారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ కేంద్రీయ విద్యాలయంలో పాఠశాల విద్య, బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజీలో బీకాం పూర్తిచేసిన ఆమె తల్లిదండ్రులిద్దరు న్యాయవాదులే కావడంతో హైదరాబాద్‌లోని పెండేకంటి లా కాలేజీలో ఎల్‌ఎల్‌బీ చదివారు. ఆతర్వాత 2022 న్యాయవాదిగా ప్రాక్టీస్ మొదలుపెట్టిన ఆమె జడ్జిగా ఎంపికవడంతో మొదటి పోస్టింగ్ భద్రాచలంలో వచ్చింది. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన దుర్గాభవానిని బార్ అసోసియేషన్ బాధ్యులు, న్యాయవాదులు సన్మానించారు.

రెండు నెలలుగా వేతనాలు బంద్..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లోని అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి రెండు నెలలుగా వేతనాలు అందడం లేదు. కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయిన నేపథ్యాన వేతనాల ఫైల్ రాష్ట్ర ట్రెజరీ కార్యాలయంలో నిలిచిపోయిందని, అక్కడి నుంచి జిల్లాకు వస్తే బిల్లు చేసే అవకాశముందని సమాచారం. కాగా, వేతనాలు ఇప్పించాలని కోరతూ ఎమ్మెల్యేతో పాటు ప్రజావాణిలో సైతం విన్నవించినా ఫలితం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. మొత్తంగా కార్పొరేషన్ పరిధిలోని కొత్తగూడెం, పాల్వంచలో శానిటేషన్ విభాగం, మేనేజర్ కేడర్, సీనియర్ జూనియర్ అసిస్టెంట్లు, అకౌంటెంట్లు, టౌన్‌ప్లానింగ్, వాటర్ సప్లె విభాగాల్లో 171 మందికి వేతనాలు నిలిచిపోయాయి. ఇకనైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి వేతనాలు అందేలా చూడాలని ఉద్యోగులు కోరుతున్నారు.

కొమరారం పోస్ట్‌మాస్టర్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు


అవార్డు అందుకుంటున్న పోస్ట్‌మాస్టర్ సుభాష్

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం గ్రామపంచాయతీ పోస్ట్‌మాస్టర్ అనుగోజు సుభాష్‌కు పోస్టల్ డిపార్ట్‌మెంట్ రీజియన్ ఎక్స్‌లెన్స్ అవార్డు వరించింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో ఉన్నతాధికారుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డాక్టర్ పీ.వీ.ఎస్. రెడ్డి, పోస్ట్‌మాస్టర్ జనరల్ సుమిత అయోధ్య, ఖమ్మం, వరంగల్ డివిజన్ సూపరింటెండెంట్లు వీరభద్రస్వామి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో పరిశీలించిన డీఈఓ


పాఠశాలలో పరిశీలిస్తున్న డీఈఓ, తదితరులు

కొత్తగూడెంఅర్బన్: భవిత కేంద్రం ఏర్పాటుకు స్థల సేకరణ కోసం జిల్లా విద్యాశాఖాధికారి నాగలక్ష్మి గురువారం కొత్తగూడెంలోని బాబు క్యాంపు ప్రైమరీ పాఠశాలను సందర్శించారు. భవిత కేంద్రం భవన నిర్మాణానికి అవసరమైన స్థలం కోసం ఎంఈఓ బి.బాలాజీ, పాఠశాల ఉపాధ్యాయులతో చర్చించారు. పాఠశాలలోని వ్యాయామశాల స్థలం, బాబు క్యాంప్‌లో ఖాళీగా ఉన్న క్వార్టర్లు, పాత ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయ స్థలాలను సైతం ఆమె పరిశీలించారు. ఈక్రమంలోనే బాబు క్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు, విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఎంపీడీఓ సుభాషిణి, హెచ్‌ఎం బి.నీరజ, గ్రామ కార్యదర్శి వి.సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,052

వయోజనులకూ ఓనమాలు..


ఉల్లాస్ కార్యక్రమ కరపత్రాలతో డీఈఓ నాగలక్ష్మి, అధికారులు (ఫైల్)

'ఉల్లాస్'తో నిరక్షరాస్యుల్లో వెలుగులు

- జిల్లాలో 38,310 మంది గుర్తింపు
- 3,810 మంది వలంటీర్ల ద్వారా శిక్షణకు ఏర్పాట్లు
- స్వచ్ఛంద బోధకులను ఆహ్వానించిన విద్యాశాఖ

కొత్తగూడెంఅర్బన్: ప్రతీ ఒక్కరికి కనీస విద్యాజ్ఞానం కలిగి ఉండాలనే ఉద్దేశంతో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నారు. వయోజన విద్యాశాఖ ఆధ్వర్యాన నవభారత్ సహకారంతో ఈ కార్యక్రమం త్వరలోనే ప్రారంభం కానుంది. శిక్షణ ఇచ్చేందుకు ఇప్పటికే జిల్లాలో 3,810 మంది వలంటీర్లను ఎంపిక చేసి మండలాల వారీగా శిక్షణ పూర్తి చేశారు. ప్రతీ గ్రామపంచాయతీ నుంచి ఇద్దరు రిసోర్స్‌పర్సన్లు, ఒక ఉపాధ్యాయుడికి శిక్షణ ఇవ్వగా, స్వచ్ఛందంగా బోధన చేయడానికి ముందుకొచ్చే వారికి శిక్షణ ఇస్తారు.

చదవడం.. రాయడం

ప్రత్యక్షంగానే కాక, ఆన్‌లైన్‌లోనూ నిరక్షరాస్యులకు బోధించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రాథమిక అక్షరాస్యతను పెంపొందించడం, వృత్తి, జీవన నైపుణ్యాలు మెరుగుపర్చడమే కాక చదవడం, రాయడం, అంకెలు గుర్తించడం, కనీస సామర్థ్యాలతో కూడిన లెక్కలు చేయడం వంటివి నేర్పిస్తారు. చిన్నతనం నుంచి విద్యావకాశాలు పొందని వారు, 15ఏళ్లు పైబడిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేలా ఈ కార్యక్రమం కొనసాగుతుంది.

అనుకూలమైన ప్రదేశాల్లో...

స్వచ్ఛందంగా బోధన చేసే వారి వీలు ఆధారంగా మండలాల్లో ఎంచుకున్న ప్రభుత్వ, ప్రభుత్వేతర పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలు, కమ్యూనిటీ భవనాలు, ఉపాధ్యాయ శిక్షణా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్థానిక సాంస్కృతిక కేంద్రాలు, లైబ్రరీలు వినియోగించుకునే వెసులుబాటు కల్పిస్తారు. అయితే సీఎస్‌ఆర్ కింద సంబంధిత సంస్థల వారు బోధనాభ్యసన సామగ్రి, డిజిటల్ పరికరాలు, మౌలిక, సాంకేతిక సదుపాయాలు కల్పించి, అక్షరాస్యతా మేళాలు, సామాజిక చైతన్య కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తారు. కాగా, అభ్యాసకులు, స్వచ్ఛంద బోధకులు ఉల్లాస్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునేలా https:/ ullas. education. gov. in/ nilp/ register వెబ్‌సైట్ అందుబాటులోకి తీసుకొచ్చారు. కాగా, స్వచ్ఛంద బోధకులకు విద్యాక్రెడిట్లను ప్రదానం చేయాలని వయోజన విద్యాశాఖ నుంచి విద్యాశాఖాధికారులకు ఆదేశాలు అందాయి. ఎనిమిదో తరగతి ఆపై చదివే వారు నిరక్షరాస్యులకు బోధన చేసే అవకాశమున్నందున ఆసక్తి ఉన్న వారు ముందుకొస్తే, వారి విద్య మెరుగుపడుతుందని భావిస్తున్నారు.

పుస్తకాలు, బోధన ఇలా...

ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 38,310 మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు గుర్తించారు. వీరందరినీ అక్షరాస్యులుగా మార్చే క్రమాన తరగతుల ప్రారంభానికి ముందు అక్షర వికాసం(వాచకం), ఇతర బోధన సామగ్రి, సెల్ ఫోన్‌పై అవగాహన కల్పిస్తారు. అలాగే, ఉల్లాస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా చూస్తారు. అభ్యాసకుల కోసం డీజీహెచ్ ఉన్న వారి ఇళ్లలో చానల్ ద్వారా ప్రసారాలు అందుబాటులోకి తీసుకొచ్చారు.

భద్రాచలంలో నిమజ్జనానికి ఏర్పాట్లు


నిమజ్జన ఘాట్ వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు


కరకట్ట మెట్ల వద్ద ఏర్పాటుచేసిన షవర్

భద్రాచలంఅర్బన్: రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వినాయక ప్రతిమలను భద్రాచలం వద్ద గోదావరిలో నిమజ్జనానికి భక్తులు తీసుకొస్తారు. ఈమేరకు నిమజ్జన ఘాట్‌లో ఏర్పాట్లను గురువారం ఎస్పీ రోహిత్ రాజు పరిశీలించి సూచనలు చేశారు. గోదావరిలో వరద పెరుగుతున్నందున కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులను లోపలికి అనుమతించొద్దని సూచించారు. రెస్క్యూ టీంను అందుబాటులో ఉంచాలని తెలిపారు. తొలుత ఘాట్‌ను భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ సైతం పరిశీలించి ఏర్పాట్లపై సమీక్షించారు. ఇక గోదావరిలోకి భక్తులను అనుమతించబోమని వెల్లడించినందున గ్రామపంచాయతీ అధికారులు కరకట్ట మెట్ల వద్ద షవర్ ఏర్పాటుచేశారు. అలాగే, వాహనాలు దిగబడకుండా ఘాట్ వద్ద చదును చేయిస్తున్న అధికారులు బ్రిడ్జి వద్ద వీధి దీపాలకు మరమ్మతు చేయిస్తున్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు మధు, టౌన్ సీఐ నాగరాజు, ఎస్‌ఐ సతీష్ కుమార్, గ్రామ పంచాయతీ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

రోజుకు లక్ష టన్నుల ఉత్పత్తికి ఆటంకం


సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో చేరిన వర్షం నీరు

సింగరేణి(కొత్తగూడెం)/సత్తుపల్లి రూరల్: మూడు రోజులు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా సింగరేణి వ్యాప్తంగా రోజుకు లక్ష టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. రోజు 1.94లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగాల్సి ఉండగా, కేవలం 94వేల టన్నులకే పరిమితమవుతోంది. తద్వారా మూడు రోజుల్లో 3లక్షల టన్నుల ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది. అలాగే, సంస్థ వ్యాప్తంగా ఓవర్ బర్డెన్ తొలగింపు కూడా నిలిచిపోయింది. ఓసీల్లో క్వారీల్లో నిలిచిన వర్షపు నీటిని ప్లాన్‌టూన్ పంపుల ద్వారా బయటకు పంపిస్తున్నారు. కాగా, సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీల్లో బొగ్గు ఉత్పత్తి, ఓవర్ బర్డెన్ తొలగింపు పనులు నిలిచిపోగా, ఓసీల్లో చేరిన నీటిని మోటార్ల సాయంతో బయటకు పంపిస్తున్నామని పీఓలు ప్రహ్లాద్, నర్సింహారావు తెలిపారు.

15 ఆర్టీసీ సర్వీసులు రద్దు..

ఖమ్మంమయూరిసెంటర్/సత్తుపల్లిటౌన్: రెండు రోజుల పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాలతో పలు ఆర్టీసీ బస్సు సర్వీసులు రద్దయ్యాయి. రీజియన్‌లోని మూడు డిపోల పరిధిలో 15 సర్వీసులను రద్దు చేసినట్లు రీజినల్ మేనేజర్ సరిరామ్ అన్నారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపోను గురువారం పరిశీలించిన ఆయన బస్సుల నిర్వహణ, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ ఖమ్మం – బోనకల్ రోడ్డులో రామకృష్ణపురం వద్ద వాగు పొంగి పొర్లగా బోనకల్, విజయవాడ రూట్‌లో ఖమ్మం డిపోకు చెందిన ఎనిమిది బస్సులు, గార్ల – ఇల్లెందు రూట్‌లో బుగ్గ వాగు పొర్లడంతో ఒక సర్వీసు రద్దు చేశామని తెలిపారు. సత్తుపల్లి డిపో పరిధిలో చెరుకుపల్లి చప్టాపైకి వరద చేరగా అన్నపురెడ్డిపల్లి రూట్‌లో రెండు, రోడ్డు దెబ్బతినడంతో తిరువూరు రూట్‌లో రెండు, కావాడిగుండ్ల రూట్‌లో ఒక సర్వీసును రద్దు చేసినట్లు చెప్పారు. అలాగే, మణుగూరు డిపో పరిధి వెంకటాపురం వద్ద రోడ్డు దెబ్బతినడంతో గుండాలకు ఒక సర్వీసును రద్దు చేసినట్లు ఆర్‌ఎం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, మధిర డీఎం శంకర్‌రావు, అసిస్టెంట్ మేనేజర్లు శ్రీనివాస్, విజయశ్రీ, ఎంఎఫ్‌లు చక్రవర్తి, సాహితీ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాన్ని ప్రతిబింబించే పండుగలు


కుమారుడితో కలిసి పూజలు చేస్తున్న కలెక్టర్


పూజలో పీఓ రాహుల్, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్

గణపతి ఉత్సవాల్లో కలెక్టర్, ఐటీడీఓ పీఓ

భద్రాచలం/భద్రాచలంటౌన్: కుల, మత తామతమ్యం లేకుండా జరుపుకునే పండుగలు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని కలెక్టర్‌జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ తెలిపారు. భద్రాచలం బస్టాండ్ సమీపాన అశోక్‌నగర్ కాలనీలో భద్రాద్రి మహారాజ్ వినాయక భక్త మండలి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన గణనాథుడికి బుధవారం వారు పూజలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలపై యువత అవగాహన పెంచుకోవాలని సూచించారు. తొలుత విగ్రహాన్ని ఐటీడీఏ పీఓ రాహుల్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్ ఆవిష్కరించారు. అలాగే, ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో జరిగిన వేడుకల్లో పీఓ పాల్గొన్నారు. భద్రాద్రి మహారాజ్ కమిటీ సభ్యులు, భక్తులు, ఐటీడీఏ సిబ్బంది వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక..

- వివాహిత ఆత్మహత్యాయత్నం
- భర్త, అత్తామామ పై కేసు

పాల్వంచరూరల్: భర్త వేధింపులు తాళలేక భార్య గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. కేటీపీఎస్-బీ కాలనీలో నివాసం ఉంటు కేటీపీఎస్‌లో ఉద్యోగం చేస్తున్న ఉండేటి చందర్‌రావు గత పన్నిండేళ్ల క్రితం తన కుమార్తె దీప్తిని పాల్వంచ మండలం ఉల్వనూరు గ్రామానికి చెందిన వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కరకపల్లి మధుకు ఇచ్చి వివాహం చేశారు. కొంతకాలం అన్యోన్యంగా సాగిన వారి జీవనంలో ఇద్దరూ పిల్లలు వన్యశ్రీ,, మహేన్‌లు ఉన్నారు. అయితే కొద్దిరోజులుగా మధు డబ్బులు తీసుకురావాలని భార్యను నిత్యం వేధిస్తూ మానసికంగా ఇబ్బందులకు గురుచేస్తున్నాడు. ఈక్రమంలో అతడి వేధింపులు తాళలేక ఈనెల 24న గడ్డి మందుతాగగా.. ఖమ్మంకు తరలించారు. ప్రస్తుం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. తండ్రి ఫిర్యాదు మేరకు గురువారం భర్త మధు, మామ భూషణం, అత్త రమణలపై ఎస్సై సురేశ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గొంతుకోసుకుని యువకుడు..

దమ్మపేట: మండల కేంద్రం దమ్మపేటలోని ఓ ఫ్యాన్సీ స్టోర్‌లో పనిచేస్తున్న యువకుడు గురువారం గొంతుకోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. స్థానికుల కథనం ప్రకారం... దమ్మపేటలో ఓ రాజస్థాన్‌కు చెందిన వ్యక్తి ఫ్యాన్సీ స్టోర్ నిర్వహిస్తుండగా.. అదే రాష్ట్రానికి చెందిన చంగన్ చౌదరి అందులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం షాపు నుంచి ఇంటికి వచ్చి కత్తితో గొంతు, చేతి మణికట్టు కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. దీంతో తోటి వ్యక్తులు క్షతగాత్రుడుని సత్తుపల్లికి, ఆపై ఖమ్మం తరలించారు. కాగా, ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

గోల్డ్‌షాపులో చోరీకి యత్నం

మెయిన్ తాళం తెరుచుకోకపోవడంతో వెనుదిరిన ఆగంతకుడు

ములకలపల్లి: మూసి ఉన్న గోల్డ్‌షాపులో చోరీకి యత్నించిన ఓ ఆగంతకుడికి తాళాలు పూర్తిగా తెరుచుకోకపోవడంతో వెనుదిరిగాడు. వివరాల్లోకి వెళితే.. స్థానిక ఇజ్జాడ శ్రీరామ్ ములకలపల్లి మెయిన్ సెంటర్‌లో వీరవర మహాలక్ష్మి పేరిట ఉన్న బంగారపు కొట్టును రోజూలాగానే బుధవారం రాత్రి షట్టర్ తాళాలు వేసి ఇంటికి వచ్చాడు. గురువారం ఉదయం ఆ షాపు తాళాలు పగులకొట్టి ఉన్నట్లు గమనించిన స్థానికులు షాపు యజమానికి ఫోన్ చేయగా.. ఆయన వచ్చి చూసి పోలీసులకు సమాచారం అందించారు. సుమారు పాతికేళ్ల యువకుడు మాస్క్ ధరించి చోరీకి యత్నించినట్లు సీసీ ఫుటేజీలో రికార్డు కాగా, మెయిన్ లాక్ తెరచుకోకపోవడంతో వెనుదిరిగినట్లు తెలుస్తోంది. ఆటోలో వచ్చినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ విషయమై ఎటువంటి ఫిర్యాదు అందలేదని.. అయితే సీసీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నాయని ఎస్సై మధుప్రసాద్ తెలిపారు.

అందుబాటులోకి అత్యాధునిక యంత్రం


యంత్రాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధి మెయిన్ వర్క్‌షాపులో అత్యాధునిక సీఎన్‌సీ పాలిగన్ మిల్లింగ్ మిషన్ అందుబాటులోకి వచ్చింది. ఈ యంత్రాన్ని గురువారం సింగరేణి డైరెక్టర్(ఈ అండ్ ఎం) సత్యనారాయణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యంత్రం ద్వారా అత్యంత వేగం, కచ్చితత్వంతో కూడిన సేవలు అందుతాయని తెలిపారు. సమస్యల గుర్తింపు, పరిష్కారంతో పాటు బొగ్గు ఉత్పత్తి పెంచడంతో ఈ యంత్రం దోహదపడుతుందని చెప్పారు. అనంతరం ఈనెల 31న ఉద్యోగవిరమణ చేయనున్న డైరెక్టర్ సత్యనారాయణను ఉద్యోగులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీఎం(ఈ అండ్ ఎం) ఎన్.దామోదర్‌రావు, ఏజీఎం రాజీవ్‌కుమార్, గుర్తింపు సంఘం నాయకులు ఎస్.వీ.రమణమూర్తి, పీతాంబరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ నిర్వాకం..

ప్రాణాపాయ స్థితిలో ఇమామ్


ఖమ్మంలో చికిత్స పొందుతున్న షేక్ హసాన్

అశ్వారావుపేట: అశ్వారావుపేటకు చెందిన ఓ ఆర్‌ఎంపీ మిడిమిడి జ్ఞానం.. ఖమ్మంలోని డయాగ్నస్టిక్ సెంటర్, ఓ ఆస్పత్రితో కమీషన్ల కక్కుర్తి వెరసి ఓ ఇమామ్(ముస్లిం మత గురువు) ప్రాణాపాయ స్థితికి చేరాడు. అశ్వారావుపేట బీసీ కాలనీ మసీద్ ఇమామ్ షేక్ హసాన్ సాలెం హఫ్మీ వారం క్రితం గ్యాస్ సమస్యతో నొప్పిగా ఉందని స్థానిక ఆర్‌ఎంపీ వద్దకు వెళ్లాడు. రెండు ఇంజక్షన్లు చేశాక సత్తుపల్లిలోని స్కానింగ్ సెంటర్‌కు పంపించి వైద్యం చేయించినా ఫలితం కానరాలేదు. తిరిగి అశ్వారావుపేట ప్రభుత్వాస్పత్రిలో పరీక్షించగా స్కానింగ్ కోసం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు. అయితే, ఖమ్మంలో ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లనివ్వకుండా ఆర్‌ఎంపీకి పరిచయం ఉన్న ఓ డాక్టర్, డయాగ్నోస్టిక్ సెంటర్‌లో పరీక్షలు, వైద్యం చేయించేలోగా దాచుకున్న డబ్బంతా ఖర్చయింది. అయినా పరిస్థితి మెరుగుపడకపోవడంతో ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరేసరికి ప్లేట్‌లెట్లు 10వేలకు పడిపోయాయని, శరీరంలో అంతర్గతంగా రక్తస్రావం అవుతోందని తేల్చారు. చికిత్సకు రూ.లక్షల్లోనే ఖర్చవుతుందని చెప్పడంతో షేక్ హసాన్ దాతల చేయూత కోసం ఎదురుచూస్తున్నారు. అశ్వారావుపేట రింగ్ సెంటర్‌లో రోడ్డు పక్కన టిఫిన్ అమ్మే మాబు కుమారుడు ఈయన చికిత్స కోసం దాతలు చూయూతనివ్వాలని పలువురు కోరుతున్నారు. కాగా, దాతలు 96760 81119(షేక్ షరీఫ్ అహ్మద్) నంబర్‌కు ఫోన్ పే ద్వారా సాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎదురుకాల్పుల్లో నలుగురు మావోల మృతి

ఛత్తీస్‌గఢ్ – మహారాష్ట్ర సరిహద్దుల్లో ఘటన

చర్ల: ఛత్తీస్‌గఢ్ – మహారాష్ట్ర సరిహద్దు అటవీ ప్రాంతంలో బుధవారం రాత్రి జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మహిళా మావోయిస్టులు సహా నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. రెండు రాష్ట్రాల సరిహద్దు అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారంతో ఆయా రాష్ట్రాల బలగాలు బుధవారం ఉదయం నుంచి కూంబింగ్ చేపట్టాయి. ఈక్రమాన బుధవారం రాత్రి పోలీసు బలగాలకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు జరపడంతో బలగాలు సైతం ఎదురుకాల్పులకు దిగాయి. ఈ ఘటనలో ముగ్గురు మహిళా మావోయిస్టులు సహా నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. రెండు రాష్ట్రాల సరిహద్దుల్లోని నారాయణపూర్ – గడ్చిరోలి జిల్లాల మధ్యలో సుమారు ఎనిమిది గంటల పాటు ఈ ఎన్‌కౌంటర్ కొనసాగింది. మావోయిస్టుల మృతదేహాల వద్ద అధునాతన ఆయుధాలు, మందుగుండు సామగ్రిని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో పలువురు మావోయిస్టులు గాయపడి తప్పించుకున్నట్లు అనుమానం ఉందని వెల్లడించిన గడ్చిరోలి డీఐజీ అంకిత్ గోయల్.. ఆ ప్రాంతానికి అదనపు బలగాలను తరలిస్తున్నట్లు తెలిపారు.

బీజాపూర్‌లో 20మంది మావోల లొంగుబాటు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో బుధవారం 20 మంది మావోయిస్టులు లొంగిపోయారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న వారు ప్రభుత్వం అమలుచేస్తున్న 'లోన్ వర్రాటా'కార్యక్రమానికి ఆకర్షితులై లొంగిపోయారని పోలీసులు తెలిపారు. వీరికి తక్షణ సాయంగా రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశామని వెల్లడించారు. మిగిలిన వారు కూడా లొంగిపోతే వారిపై ఉన్న కేసులను రద్దు చేయడమే కాక ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం, భరోసా కల్పించనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో ఉపాధ్యాయుడి హత్య

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా సిల్గేర్ సమీపాన పోలీస్ ఇన్‌ఫార్మర్ పేరుతో ప్రభుత్వ ఉపాధ్యాయుడిని మావోయిస్టులు హతమార్చారు. సుక్మా జిల్లా మండిమర్క పాఠశాల ఉపాధ్యాయుడు లక్ష్మణ్ బర్సే జగురుగొండ పోలీస్‌స్టేషన్ పరిధి సిల్గేర్ ప్రాంతంలో నివాసముంటున్నాడు. ఆయన ఇంటికి బుధవారం రాత్రి వచ్చిన మావోయిస్టులు పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడని చెబుతూ పదునైన ఆయుధంతో దాడి చేసి హతమార్చారు. కుటుంబసభ్యులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా వారిని కూడా కొట్టారని తెలిసింది.

పాఠశాలలోకి పాము


వరద నీటిలో వచ్చిన పాము

దమ్మపేట: మండలంలోని నెమలిపేట గ్రామ కాలువకు వరద ఉధృతి పెరగడంతో పక్కనే ఉన్న ఇళ్లు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోకి వరద నీరు చేరుకుంది. కాలువ ప్రవాహంలో వచ్చిన ఓ పాము.. వరద నీటిలో పాఠశాల ప్రాంగణంలోకి రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

అశ్వారావుపేట రూరల్: అశ్వారావుపేటలో డంపింగ్ యార్డు వద్ద బుధవారం సాయంత్రం పలువురు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఐదుగురిని అదుపులోకి తీసుకుని రూ.2,910 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై టి.యయాతి రాజు తెలిపారు.

షోరూమ్‌లో బైక్ దొంగతనం..

కూనవరం రోడ్డులో పట్టుకున్న పోలీసులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణం చర్ల రోడ్డులో గల రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ షోరూమ్‌లోని ఓ బైక్‌ను ఈ నెల 26 అర్ధరాత్రి ఓ వ్యక్తి దొంగిలించాడు. ఈవిషయమై 27న ఉదయం స్థానిక పోలీస్ స్టేషన్‌లో షోరూమ్ నిర్వాహకులు ఫిర్యాదు చేయగా.. విచారణ చేపట్టిన పోలీసులు బుధవారం సాయంత్రం ఆ బైక్ దొంగను పట్టణంలోని కూనవరం రోడ్డులో పట్టుకున్నారు. స్టేషన్‌కు తరలించి విచారించగా.. దుమ్ముగూడెంకు చెందిన కణితి వెంకటేశ్వర్లుగా తేలిందని పోలీసులు తెలిపి అతడిపై కేసు నమోదు చేశారు.

చెట్లు నరికిన వ్యక్తికి జరిమానా..

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం గ్రామపంచాయతీ పరిధిలో రహదారి పక్కన నాటిన అవెన్యూ ప్లాంటేషన్‌లోని మొక్కలను పోలారం గ్రామానికి చెందిన రైతు అంగోత్ రాంబాబు బుధవారం నరికాడు. ఈ చెట్ల ద్వారా మొక్కజొన్న చేనులో కోతుల బెడద ఎక్కువైనందున నరికినట్లు రైతు చెబుతున్నాడు. గురువారం పరిశీలించిన పంచాయతీ కార్యదర్శి కిరణ్ అనుమతులు లేకుండా నరికిన ఐదు చెట్లకు గాను రూ.5వేలు జరిమానా విధించి రశీదు అందించారు. మొక్కలు నరికిన స్థానంలో పది మొక్కలు నాటాలని షరతు విధించినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

ప్రసూతి మరణాలు అరికట్టేలా అవగాహన

కొత్తగూడెంఅర్బన్: ప్రసూతి మరణాలు లేకుండా చూడాల్సిన అవసరముందని జిల్లా వైద్యా, ఆరోగ్యశాఖాధికారి జయలక్ష్మి తెలిపారు. గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ప్రసూతి మరణాలపై నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ప్రసూతి మరణాలను నివారించడానికి కౌన్సెలింగ్, ఆరోగ్య విద్య కీలకమని, ప్రమాదాలను ముందస్తుగా గుర్తించడం, మెరుగుపర్చడం, రోగులు, ఆరోగ్య సంరక్షణ కార్మికులకు నిరంతరం అవగాహన కల్పించడం వలన ప్రసూతి ఆరోగ్య ఫలితాలను మెరుగుపర్చవచ్చారు. ఈ సందర్భంగా చంద్రుగొండ, ఎంపీ బంజారా, కొమ్మారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి వైద్యాధికారులు హాజరై ప్రతి కేసుపై సమగ్ర నివేదికలను సమర్పించారు. ఈ సమావేశంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వి.మధువరన్, డాక్టర్ పి.స్పందన, డాక్టర్ భూపాల్‌రెడ్డి, డిప్యూటీ డెమో ఎండీ ఫైజ్మోహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.